మేడ్చల్‌ వీరభద్రీయ సంఘ భవనం ప్రారంభం



ప్రారంభోత్సవంలో పాల్గొన్న కాంగ్రెస్‌ నాయకులు

మేడ్చల్‌: మేడ్చల్‌ 12వ వార్డులోని కృపా కాలనీలో నిర్మించిన వీర భద్రీయ కుల సంఘ భవనాన్ని కాంగ్రెస్‌ నేతలు ఆదివారం ప్రారంభించారు. జిల్లా కాంగ్రెస్‌ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి స్థానిక కాంగ్రెస్‌ నేతలు, కాంగ్రెస్‌ పార్టీకి చెందిన కౌన్సిలర్లు కలిసి ప్రారంభించారు. ఎంపీ ఈటల రాజేందర్‌ సైతం ప్రారంభోత్సవంలో పాల్గొని అనంతరం మేడ్చల్‌లో ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో ప్రసంగించారు. సమావేశంలో స్థానిక కౌన్సిలర్‌ బత్తుల ప్రియాంక మధుకర్‌యాదవ్‌, కాంగ్రెస్‌, బీజేపీ నాయకులు, కుల సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ ఆలోచనా విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఘట్‌కేసర్‌: అంబేడ్కర్‌ దేశ ప్రజలకు సమాన హక్కులు కల్పించారని బీజేపీ పీర్జాదిగూడ కార్పొరేషన్‌ అధ్యక్షుడు అనిల్‌రెడ్డి అన్నారు. ఆదివారం అంబేడ్కర్‌ ఆలోచన విధానాలు ప్రజల్లోకి తీసుకెళ్లడానికి అరుణ్‌కుమార్‌ ఆధ్వర్యంలో అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాల సమర్పించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... అంబేడ్కర్‌ రాజ్యాంగంతో మహిళలు నేడు పురుషులతో సమానంగా పోటీ పడుతున్నారని, కుల, మత, వర్గ భేదం లేకుండా అందరికి ఓటు హక్కు కల్పించాడన్నారు. కార్యక్రమంలో దాసు, సత్యం, శ్రీనివాస్‌, రాజేశ్‌కుమార్‌, సంగమేశ్వర్‌, సుధాకర్‌, గణేశ్‌గౌడ్‌, జగదీశ్‌, రాములు, కృష్ణంరాజు, వెంకటేశ్వర్‌రావు, కళ్యాణ్‌ శ్రీనివాస్‌, శ్రీరామ్‌, సాయి, ప్రవీణ్‌, అఖిల్‌, సాయిచరణ్‌ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది

బోడుప్పల్‌: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బోడుప్పల్‌ కమిషనర్‌ రామలింగం అన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం చెత్త శుద్ధి కేంద్రం వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యతను పెంచేందుకు, కాలుష్య నివారణకు విరివిగా మొక్కలు నాటాలన్నారు. నాటిన మొక్కలను పరిరక్షించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నారాయణరెడ్డి, కమలాకర్‌, హెల్త్‌ అసిస్టెంట్‌ వినోద్‌, స్వచ్ఛ భారత్‌ మిషన్‌ కో– ఆర్డినేటర్లు మల్లేష్‌ మహేందర్‌, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ శాంతి

మల్లాపూర్‌: నాచారం డివిజన్‌ పరిధిలోని కార్తీకేయనగర్‌ రోడ్‌ నెంబర్‌10 లో 40 మీటర్ల సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించారు. సీసీరోడ్డు పనులను కార్పొరేటర్‌ శాంతి సాయిజెన్‌శేఖర్‌ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. గతంలో 40 మీటర్ల సిమెంట్‌ రోడ్డు వేయిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చామని, హామీ ప్రకారం రోడ్డు వేయించామని పేర్కొన్నారు. ఏఈ స్రవంతి, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ విజయ్‌కుమార్‌, బీఆర్‌ఎస్‌ నేతలు కట్ట బుచ్చన్నగౌడ్‌, దాసరి కర్ణ, కృష్ణ, కాలనీవాసి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శన



ఉప్పల్‌ మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న భరత నాట్యం

ఉప్పల్‌: ఉప్పల్‌ మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నర్తనం ఆర్ట్స్‌ కళాశాల గురువులు వర్షిణి శిష్య బృందంచే నిర్వహించిన భరతనాట్యం ప్రదర్శన అలరించింది. పుష్పాంజలి, గజవదన అలరిపు, ఆనంద నర్తన, గణపతిమ్‌, షడాక్షరం, మహిషాసురమర్ధిని తదితర అంశాలను ప్రణవి, నవ్య, చారులత, సంజీవిని, వైభవి, ఆర్య, గౌతమి, మనస్విని, భువనకృతి మొదలైన కళాకారులు ప్రదర్శించి మెప్పించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న కోట నీలిమ

సనత్‌నగర్‌: ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్‌ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని, ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరికీ అందేలా కృషి చేస్తానని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆమె పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బన్సీలాల్‌పేట న్యూబోయిగూడలో గొల్లకొమరయ్య కాలనీలో జరుగుతున్న పనులపై సమీక్షించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

శివారు రహదారులు.. నరకానికి నకళ్లు!

విలీన పంచాయతీలపై పట్టింపులేక ఇబ్బందులు

- మరమ్మతులు లేక.. కొత్త పనులు చేపట్టక అభివృద్ధికి దూరంగా పురపాలికలు
- రూ. కోట్లల్లో పన్నులు వసూలైనా తప్పని ఇక్కట్లు
- పట్టించుకోని పాలకవర్గం, అధికారగణం





ఘట్‌కేసర్‌, జవహర్‌నగర్‌లలో అధ్వానంగా తయారైన రహదారులు

సాక్షి, సిటీబ్యూరో: నగర శివారు పట్టణాల్లో అధికార యంత్రాంతం పన్నుల వసూళ్లు, అక్రమ లావాదేవీలపై ఉన్న శ్రద్ధను అభివృద్ధి కార్యక్రమాలపై చూపకపోవటంతో పట్టణ ప్రజలు పలు సమస్యలతో తల్లడిల్లుతున్నారు. ఇటీవల శివారుల్లోని 11 పురపాలికల్లో విలీనమైన 40 పంచాయతీల్లో పేరుకపోయిన చెత్తాచెదారం, అధ్వాన స్థితికి చేరిన డ్రైనేజీలు, గుంతల రోడ్ల సమస్యలతో పట్టణాల పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. విలీనమైన 40 పంచాయతీలకు మున్సిపల్‌ శాఖకు చెందిన జిల్లా స్థాయి అధికారులను స్పెషల్‌ ఆఫీసర్లుగా నియమించినా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అనే చందంగా తయారైంది. చిన్న పాటి వర్ష పడితే చాలు రోడ్లన్నీ చిత్తడిగా మారుతుండగా, పట్టణాలు నరకానికి నకళ్లుగా దర్శనమిస్తున్నాయి. ఇటీవల ఎడతెరిపి లేకుండా రోజూ కురుస్తున్న వర్షంతో లోతట్టు ప్రాంతాలు, మురికి వాడలు వరదమయంగా మారుతుండగా, రోడ్లన్నీ అస్తవ్యస్తంగా నడవలేని స్థితికి చేరుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- శివారుల్లో అతిపెద్ద నగర పాలక సంస్థ బోడుప్పల్‌లో రూ. 1.50 లక్షల జనాభాతో 162 కాలనీలు ఉండగా, వివిధ పన్నుల ద్వారా ఏటా రూ. 60 కోట్లకు పైగా ఆదాయం సమకూరుతోంది. అయినా అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, కాలుష్యం, చెరువు నీటి దుర్వాసన, పైప్‌లైన్‌ లీకేజీలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
- మరో మున్సిపల్‌ కార్పొరేషన్‌ పీర్జాదిగూడ కూడా లక్షకు పైగా జనాభాతో 80 కాలనీలను కలిగి ఉండగా, ఏటా పన్నుల ద్వారా రూ. 40 కోట్లకు పైగా ఆదాయం వస్తోంది. అయినా ప్రజలు మాత్రం పలు సమస్యలతో బాధపడుతున్నారు. సమస్యలు వీటికే పరిమితం కాలేదు. ఇలాంటి అధ్వాన పరిస్థితులు ఉన్న పట్టణాలు నగర శివారు పరిధిలో పలు నగర పాలక సంస్థలు, మున్సిపాలిటీలు ఉన్నాయి.
- ఇటీవల శివారుల్లోని 40 గ్రామ పంచాయతీలను కూడా ఏడు పురపాలక సంఘాల్లో ప్రభుత్వం విలీనం చేసింది. ఇక్కడా బోలెడు సమస్యలు దర్శనమిస్తున్నాయి.

శివారుల్లో పట్టణాలివే...

నగర శివారుల్లో బోడుప్పల్‌, పీర్జాదిగూడ నిజాంపేట్‌, జవహర్‌నగర్‌, బడంగ్‌పేట్‌, మీర్‌పేట్‌, బండ్లగూడ నగర పాలక సంస్థలు కాగా, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్‌, గుండ్లపోచంపల్లి, తూముకుంట, కొంపల్లి, దుండిగల్‌, మేడ్చల్‌, పెద్ద అంబర్‌పేట్‌, తుక్కుగూడ, ఇబ్రహీంపట్నం, జల్‌పల్లి, షాద్‌నగర్‌, శంషాబాద్‌, శంకర్‌పల్లి, తుర్కయాంజాల్‌, మణికొండ, నార్సింగ్‌,ఆ దిభట్ల, అమనగల్లు మున్సిపాలిటీలుగా కొనసాగుతున్నాయి.

విలీన జీపీల్లోనూ అదే పరిస్థితి...

ఏడు పురపాలక సంఘాల్లో విలీనమైన 40 గ్రామ పంచాయతీల్లో కూడా సమస్యలు పేరుకుపోయాయి. బాధ్యతలు చేపట్టిన స్పెషల్‌ ఆఫీసర్లకు తాము ఎదుర్కొంటున్న బాధలు చెబుతామనుకుంటే.. ఇప్పటి వరకు తమ ప్రాంతాలకు కన్నెత్తి కూడా చూడలేదని అందోళన వ్యక్తం చేస్తున్నారు. విలీనమైన 40 పంచాయతీలకు తాత్కాలికంగా ప్రభుత్వం స్పెషల్‌ ఆఫీసర్లను నియమించింది.

స్పెషల్‌ ఆఫీసర్లు వీరే...

మేడ్చల్‌, దమ్మాయిగూడ, నాగారం పురపాలక సంఘాల్లో విలీనమై 10 జీపీలకు స్పెషల్‌ ఆఫీసర్‌గా మున్సిపల్‌ శాఖ జేడీ బి.శ్రీనివాస్‌రావు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పోచారం పురపాలికలో కలిసిన 5 జీపీలకు స్పెషల్‌ ఆఫీసర్‌గా మున్సిపల్‌ శాఖ జేడీ కె.నారాయణరావు వ్యవహరిస్తున్నారు. ఘట్‌కేసర్‌ పురపాలికలో విలీనమైన 6 జీపీలకు స్పెషల్‌ ఆఫీసర్‌గా మున్సిపల్‌ శాఖ జేడీ శ్రీపాదరామేశ్వర్‌ బాధ్యతలు చేపట్టారు. గుండ్లపోచంపల్లి పురపాలికలో విలీనమైన 2 జీపీలకు కాగా స్పెషల్‌ ఆఫీసర్‌గా మున్సిపల్‌ శాఖ జేడీ బి.సంధ్య, తూంకుంట పురపాలికలో కలిసిన 3 జీపీలకు స్పెషల్‌ ఆఫీసర్‌గా మున్సిపల్‌ శాఖ ఏడీ జ్యోత్స్న, పెద్దఅంబర్‌పేట పురపాలికలో కలిసిన 4 జీపీలకు స్పెషల్‌ ఆఫీసర్‌గా మున్సిపల్‌ శాఖ జేడీ శ్రీపాదరామేశ్వర్‌ నియమితులయ్యారు. శంషాబాద్‌, తుక్కుగూడ, నార్సింగి పురపాలికల్లో విలీనమైన 8 జీపీలకు స్పెషల్‌ ఆఫీసర్‌గా మున్సిపల్‌ శాఖ జేడీ శ్రీధర్‌ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

రూ. కోట్లల్లో పన్నులు వసూలైనా..

మేడ్చల్‌ జిల్లాలో 13 పురపాలక సంఘాల నుంచి పన్నుల ద్వారా రూ. 190 కోట్లు వస్తుండగా, రంగారెడ్డి జిల్లాలో 16 పురపాలక సంఘాల నుంచి రూ. 175 కోట్లు వసూలవుతున్నాయి. 15వ ఆర్థిక సంఘం ద్వారా కూడా ప్రతి నెల ఒక్కో పురపాలక సంఘానికి రూ. 3 నుంచి రూ. 21 లక్షల నిధులు విడుదలవుతున్నాయి.

- వీటిని ప్రణాళికాబద్ధంగా పనులకు వెచ్చించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టక పోవటంతో అభివృద్ధి రెండు అడుగులు ముందుకు.. మూడు అడుగులు వెనక్కి అనే చందంగా తయారైంది.





పోచారం, దమ్మాయిగూడలలో అధ్వానంగా తయారైన రహదారులు

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేసిన చైర్మన్‌ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు చైర్మన్‌ కొకుట్ల చంద్రారెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజ్‌సుఖ్‌నగర్‌లో రూ. 7 లక్షల సాధారణ నిధులతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్‌ చైర్మన్‌ బండారి మల్లేష్‌ యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లోని బంగారు ఆభరణాల చోరీ

గ్యాస్‌ సిలిండర్లను కూడా ఎత్తుకెళ్లిన దుండగులు



చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

ఘట్‌కేసర్‌: చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్లి వచ్చేలోగా సదరు వ్యక్తి ఇంటిలో చోరీ జరిగిన సంఘటన ఘట్‌కేసర్‌లో వెలుగుచూసింది. పోలీసుల సమాచారం మేరకు... బ్రూక్‌బాండ్‌ కాలనీకి చెందిన అంకం శారద(65) కంటి వైద్యం కోసం నాలుగు నెలల క్రితం బోయిన్‌పల్లిలోని కూతురు ఇంటికి వెళ్లింది. కంటికి వైద్యం చేయించుకొని ఆదివారం మధ్యాహ్నం ఇంటికి వచ్చే సరికి ఇంటి దర్వాజ పగులగొట్టి ఉంది. లోపలకి వెళ్లి చూడగా అల్మారా డోర్లు తెరిచి ఉన్నాయి. అల్మారా పరిశీలించగా అందులో దాచిన 10 గ్రాముల బంగారు గొలుసు, ఇంటిలోని రెండు గ్యాస్‌ సిలిండర్లు కనిపించలేదు. దీంతో చోరీపై పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు చోరీ వివరాలు సేకరించారు .బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అభివృద్ధితో ప్రజల భాగస్వామ్యం భేష్‌



దాతలను సత్కరించిన చైర్మన్‌ కొండల్‌రెడ్డి

పోచారం: అన్నోజిగూడలోని సాయినగర్‌ కాలనీలో 45 మీటర్ల వరకు భూగర్భ డ్రైనేజీని కాలనీ వాసుల సహకారంతో నిర్మించారు. డ్రైనేజీ వ్యవస్థను చైర్మన్‌ కొండల్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అభివృద్ధి పనుల్లో కాలనీవాసుల భాగస్వామ్యం అభినందనీయమన్నారు. అనంతరం దాతలను చైర్మన్‌ సత్కరించారు.

ఎన్‌పీఆర్డీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌గా రమేష్‌ ఏకగ్రీవం

మల్కాజిగిరి: దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్డీ) మేడ్చల్‌ మల్కాజిగిరి జిల్లా వర్కింగ్‌ ప్రెసిడెంట్‌గా మల్కాజిగిరికి చెందిన సుల్తాన్‌ రమేష్‌ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సుల్తాన్‌ రమేష్‌ మాట్లాడుతూ.. దివ్యాంగులకు సేవ చేయడానికి వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌, జిల్లా అధ్యక్షుడు చంద్ర మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరంతో పేదలకు మేలు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్‌ చందర్‌గౌడ్‌

బోడుప్పల్‌: పేద, మధ్యతరగతి ప్రజలకు మరింత వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఉందని బోడుప్పల్‌ 3వ డివిజన్‌ కార్పొరేటర్‌ కొత్త చందర్‌గౌడ్‌ అన్నారు. నేషనల్‌ ఆయుష్‌ మిషన్‌, ఆయుష్‌ గ్రోమ్‌లో భాగంగా ఆదివారం చెంగిచర్ల వెంకట సాయినగర్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న ఆహారపు అలవాట్లను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ తరుచుగా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. శిబిరంలో పాల్గొన్న వారికి షుగర్‌, బీపీ, రక్తహీనత పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. జేఎస్‌పీఎస్‌ ప్రభుత్వ హోమియో వైద్య కళాశాల బృందం డాక్టర్‌ పొన్నం అనిల్‌కుమార్‌, డాక్టర్‌ శ్రీజ, డాక్టర్‌ నరేందర్‌, డాక్టర్‌ సుప్రియ, డాక్టర్‌ ప్రత్యూష, డాక్టర్‌ సాయితేజ్‌ పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక ఓనం



రామంతాపూర్‌లో కళాకారుల ప్రదర్శన

రామంతాపూర్‌: కేరళ ఆర్ట్స్‌ కల్చరల్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక లింగారెడ్డి గార్డెన్‌లో ఓనం పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన లోక కేరళ సభా సభ్యులు థామస్‌ జాన్‌, బెంజమిన్‌ మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కేరళీయుల సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక ఓనం అని చరిత్ర ప్రకారం కేరళలో పాలించిన మహాబలి కాలంలో ప్రజలు సుఖ శాంతులతో ఉండే వారని మహాబలి ఆగమనాన్ని స్వాగతం పలికేందుకు ఓనం పండుగ నిర్వహిస్తారన్నారు. అనంతరం నిర్వహించిన మహాబలి వామన మూర్తులను స్వాగతం పలికే నృత్యం పలువురిని ఆకట్టుకుంది. రామంతాపూర్‌ కేరళ ఆర్ట్స్‌ అండ్‌ కల్చర్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు ఏపీ రుద్రదాస్‌, ప్రధాన కార్యదర్శి ఎస్‌.అలెక్స్‌, కోశాధికారి ఎస్‌. మురుకేష్‌, రఘునాథన్‌, పెళ్లయి నాయర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి లేని జీవితాన్ని గడపండి



వేడుకల్లో ఓసీటీ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సనత్‌నగర్‌: ప్రతిరోజూ 30 నిమిషాల పాటు వ్యాయామంతో పాటు పౌష్టికాహారం తీసుకుంటూ ఒత్తిడి లేని జవితం గడిపితే గుండె సంబంధ సమస్యల బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చని కిమ్స్‌–సన్‌షైన్‌ హాస్పటల్‌ కార్డియాలజీ హెచ్‌ఓడీ, కార్డియోథోరాసిక్‌ సర్జన్‌ డాక్టర్‌ శ్రీధర్‌ కస్తూరి తెలిపారు. వరల్డ్‌ హార్ట్‌ డే వేడుకలను బేగంపేటలోని కిమ్స్‌–సన్‌షైన్‌ హాస్పటల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్‌ శ్రీధర్‌ కస్తూరి రాసిన ఓసీటీ (వన్‌ పోర్టల్‌ వేవ్‌ దేకెన్‌ యాక్సిస్‌ ఏ టు జెడ్‌) పేరిట ఇంటర్వెన్షనల్‌ కార్డియాలజిస్టులకు ఉపయోగపడే ప్రొసీజర్‌ లిటరేచర్‌ పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డాక్టర్‌ శ్రీధర్‌ కస్తూరి మాట్లాడుతూ కార్డియోవాస్కులర్‌ డిసీజ్‌ కారణంగా ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా 20.5 మిలియన్ల మరణాలు సంభవిస్తున్నాయన్నారు. చెడు ఆహారపు అలవాట్ల కారణంగా ఆరు మిలియన్ల మరణాలు సంభవిస్తున్నాయని, ప్రతి ఒక్కరి జీవితంలో డైట్‌ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. అనంతరం కార్డియాలజీ విభాగంలో పనిచేసే సీనియర్‌ వైద్యులను కిమ్స్‌హాస్పటల్‌ సీఓఓ సుధాకర్‌ జాదో ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమంలో జీఎం చందర్‌ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కీసరలో స్వచ్ఛభారత్‌ సేవా పక్షంలో పాల్గొన్న ఏనుగు సుదర్శన్‌రెడ్డి తదితరులు

కీసర: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల మనతో పాటు, ఇతరులకు ఎంతో మేలు జరుగుతుందని బీజేపీ మేడ్చల్‌ నియోజకవర్గ సీనియర్‌ నాయకుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఆదివారం కీసరలో స్వచ్ఛభారత్‌ సేవా పక్షం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్‌ చౌరస్తా పరిసర ప్రాంతంతో పాటు, దేవాలయాలు, ప్రభుత్వ పాఠశాలల ఆవరణల్లో స్థానిక బీజేపీ నేతలతో కలిసి పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చెత్తాచెదారాన్ని తొలగించి, స్వచ్ఛభారత్‌ సేవా పక్షం విశిష్టతను తెలియజేశారు. బీజేపీ మేడ్చల్‌ జిల్లా రూరల్‌ అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. నాగారం మున్సిపల్‌ చైర్మన్‌ కొకుట్ల చంద్రారెడ్డి, స్వచ్ఛభారత్‌ సేవా పక్షం జిల్లా కన్వీనర్‌ గౌరారం జగన్‌గౌడ్‌, బీజేపీ నేతలు జిల్లాల తిరుమల్‌రెడ్డి, సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాగుల అశోక్‌ముదిరాజ్‌, మల్లేష్‌గౌడ్‌, చంద్రశేఖర్‌, శ్రీనివాస్‌గౌడ్‌, బండారి శ్రీనివాస్‌రెడ్డి, నల్ల వెంకట్‌రెడ్డి, మహేష్‌, శ్రీకాంత్‌గౌడ్‌, సురేష్‌, మెట్టు కృష్ణాయాదవ్‌, మహేందర్‌యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డును తరలించాలి

- స్పందించకుంటే చెత్తను తీసుకొచ్చే వాహనాలను అడ్డుకుంటాం
- జవహర్‌నగర్‌ డంపింగ్‌ యార్డు సన్నాహక కమిటీ హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న జవహర్‌నగర్‌ డంపింగ్‌యార్డు సన్నాహక కమిటీ నేతలు

కవాడిగూడ: దమ్మాయిగూడలో ఉన్న జవహర్‌నగర్‌ డంపింగ్‌ యార్డును నగర నలుమూలలకు తరలించి తమను కాపాడాలని జవహర్‌నగర్‌ డంపింగ్‌యార్డు సన్నాహక కమిటీ నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మల్కాజ్‌గిరి ఎంపీగా ఉన్న సమయంలో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి తమకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీని వెంటనే నిలబెట్టుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి నిర్ణయం తీసుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో తమ ప్రాంతాలకు చెత్తను తీసుకొచ్చే వాహనాలు, చెత్త రిక్షాలను ఎక్కడికక్కడ అడ్డుకోని నగరాన్ని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు.

- జవహర్‌నగర్‌ డంపింగ్‌ యార్డును వెంటనే మూసివేయాలని డిమాండ్‌ చేస్తూ ఆదివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌ వద్ద డంపింగ్‌ యార్డు బాధితులు పెద్ద ఎత్తున ధర్నా నిరసన వ్యక్తం చేశారు. దమ్మాయిగూడలో ఉన్న ప్రజల ఆరోగ్యం ప్రభుత్వానికి పట్టదా గత అనేక సంవత్సరాలుగా డంపింగ్‌ యార్డు అనేక ఇబ్బందులు పడుతున్నామని కలుషిత తాగునీరు వివిధ రకాల రోగాల బారిన పడుతున్నామని వారు ఆందోళన వ్యక్తం చేశారు.
- ఈ సందర్భంగా జవహర్‌నగర్‌ డంపింగ్‌ యార్డు నిరసన దీక్ష సన్నాహక కమిటీ కన్వీనర్లు గోగుల రామకృష్ణ, కేతుపల్లి పద్మాచారి, మారెం సమ్మిరెడ్డి, సంజీవ్‌రెడ్డి, సందీప్‌, గవ నివ్వర తదితరులు మాట్లాడారు. డంపింగ్‌యార్డు ఏర్పాటు చేసిన నాటి నుంచి 15ఏళ్లుగా స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జేఏసీ నేతలు ఎన్ని సార్లు ప్రజా ప్రతినిధులు, అధికారులను కలిసినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.
- ఇప్పటికైనా ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిలు స్పందించి జవహర్‌నగర్‌లో ఉన్న డంపింగ్‌ యార్డును తరలించాలని డిమాండ్‌ చేశారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో తమ ఉద్యమ కార్యాచరణను ప్రకటించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని వారు హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లడానికే ఇందిరాపార్కు వద్ద ధర్నా చేస్తున్నట్లు వివరించారు.